## పీడీఎస్ బియ్యం పట్టివేత

బెజ్జూర్, డిసెంబర్ 12 : మండల కేంద్రానికి చెందిన వ్యాపారి యాద సంతోష్ వద్ద మంగళవారం 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ సందీప్‌తో కలిసి ఆయన మండల కేంద్రంలో సోదాలు నిర్వహించగా, సదరు వ్యక్తి వద్ద 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనపరుచుకొని బెజ్జూర్ పోలీసులకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు వారు పేర్కొన్నారు. పీసీలు మధు, రమేశ్, సంజయ్ పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణపై అవగాహన

వాంకిడి, డిసెంబర్ 12: మండలంలోని ప్రజా ప్రతినిధులకు మంగళవారం స్థానిక తహసీల్దార్ రహీమొద్దీన్ ఆధ్వర్యంలో తహసీల్ కార్యాలయ సమావేశ మందిరంలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై మండలంలోని ప్రజాప్రతినిధులకు అవగాహన కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదు కార్యక్రమ అమలు వివరాలను వెల్లడించారు. ప్రజాప్రతినిధులందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ముండే విమలాబాయి, వైస్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్, బంబార సర్పంచ్ ఆయూబ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గుర్నులే నారాయణ, అధికారులు, కార్యలయం సిబ్బంది తదితరులున్నారు.

## పారదర్శకంగా ఆడిట్ చేపట్టాలి

దహెగాం, డిసెంబర్ 12: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై పారదర్శకంగా సోషల్ ఆడిట్ చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ అధికారి కృష్ణమూర్తి అన్నారు. ఎంపీడీవో రాజేశ్వర్ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 2022-2023 ఆర్థిక సంత్సరంలో చేపట్టిన పనులపై ఈ నెల చివరి వారంలో సోషల్ ఆడిట్ ఉంటుందన్నారు. ఈ సోషల్ ఆడిట్‌లో చేపట్టే వివిధ అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ సాయిశ్రీ, ఏపీవో కల్పన, తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకుల పంపిణీ

చింతలమానేపల్లి, డిసెంబర్ 12: మండలంలోని బాబాసాగర్ గ్రామానికి చెందిన కారు నిలేశ్‌కు చెందిన ఇండ్లు నిప్పంటుకొని పూర్తిగా దగ్ధమయ్యాయి. ఇంట్లో ఉన్న రూ. 20 వేలతో పాటు బట్టలు, ఇంటి సామగ్రి, విలువైన పత్రాలు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న శ్రీ శివరామ సాయి యూత్ వేల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గుర్లే శ్రీనివాస్ యూత్ సభ్యులు కౌటాల సీఐ సాధిక్ పాషా సహకారంతో దుప్పట్లు, నిత్యావసర వస్తువులు, నగదు అందజేశారు. యూత్ ప్రధాన కార్యదర్శి తుమోజు వెంకటేశ్, ఉపాధ్యక్షుడు పురుషోత్తం, విజయ్, శ్రీనివాస్, సుధాకర్, బాపురావు, కత్తెర్ల భీమేశ్, మహేందర్, శ్రీనివాస్, రవి, తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తు చేసుకోండి

వాంకిడి, డిసెంబర్ 12: మండలంలో 18 ఏండ్లు నిండిన వారు కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రహీమొద్దీన్ ఒక ప్రకటనలో కోరారు. జనవరి 1, 2024 నాటికి 18 ఏండ్లు నిండిన వారు కొత్తగా ఓటు హక్కు నమోదుకు అర్హులని, తమ దరఖాస్తును గ్రామంలోని బీఎల్వోలకు గాని, నేరుగా తహసీల్ కార్యాలయంలో అందజేయవచ్చని సూచించారు. అలాగే తమ ఓటు హక్కు అదే గ్రామంలోని ఇతర వార్డులకు , ఇతర గ్రామాలకు బదిలీ చేసుకోవచ్చని తెలిపారు. దీని కోసం ఫారం -8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ తెలిపారు.

## ఉద్యమకారులను అదుకోవాలి

ఆసిఫాబాద్, డిసెంబర్12: మలిదశ తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం అదుకోవాలని ఉద్యమకారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్స్‌పార్కులో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఉద్యమించిన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులు రాజేశ్వర్, రమేశ్, ఉపేందర్, సావిత్రి, చిరంజీవి, బాబురావు, ఆశోక్, ఉత్తమ్ నాయక్, షర్ఫొద్దీన్, సాజీద్, అన్సార్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో హక్కులు కల్పించిన ఘనత కేసీఆర్‌దే..

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన, డిసెంబర్ 12: కోలిండియా స్థాయిలో లేని హక్కులను సింగరేణిలో కల్పించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఏరియాలోని ఖైర్‌గూడ ఓసీపీలో మంగళవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మికి టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయగా, ఆమె హాజరయ్యారు. సన్మానం అనంతరం ఆమె మాట్లాడుతూ తన గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన సింగరేణి కార్మికులు, టీబీజీకేఎస్ నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి కేసీఆర్ సీఎం అయిన తరువాత సింగరేణి కార్మికులకు అనేక హక్కులు కల్పించారని గుర్తు చేశారు. జాతీయ కార్మిక సంఘాలు పోగొట్టిన వారసత్వ ఉద్యోగాలను తిరిగి అమలు చేసిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. కార్మికుల కోసం అహర్నిశలు పాటు పడుతున్న టీబీజీకేఎస్‌కు కార్మికులు అండగా నిలిచి, గెలిపించాలని కోరారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సంగెం ప్రకాశ్‌రావు, పిట్ కార్యదర్శి కార్నాథం వెంకటేశం, కేంద్ర కమిటీ సభ్యుడు గెల్లి రాయలింగు, కార్పొరేట్ చర్చల ప్రతినిధి మంగీలాల్, మాజీ ఉపాధ్యక్షుడు నల్లగొండ సదాశివ్, ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జడ్పీటీసీ వేముర్ల సంతోష్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు చెన్న సోమశేఖర్, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ పర్లపల్లి వనజ, వైస్ చైర్‌పర్సన్ కుందారపు శంకరమ్మ, జీఎం కమిటీ సభ్యులు మారిన వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, తదితర నాయకులు పాల్గొన్నారు.


రెబ్బెన: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి


ఆసిఫాబాద్: ఎమ్మెల్యే కోవ లక్ష్మిని సన్మానిస్తున్న నాయకులు

### శుభాకాంక్షల వెల్లువ

ఆసిఫాబాద్, డిసెంబర్12: ఎమ్మెల్యే కోవలక్ష్మికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలు సంఘాల నాయకులు మంగళవారం శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేయడంతో పాటు శాలువాతో సత్కరించారు. పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు, లింగయ్య, శ్రీకాంత్, చందు, శ్రీనివాస్, ధర్మయ్య, ప్రకాశ్, రవి, సంజీవ్, మోహన్, శంకర్, ప్రణయ్, రవి, లక్ష్మీనారాయణ, అజయ్, సునీల్, రమేశ్, మధుకర్, విజయ, పుష్ప, సునీత ఉన్నారు.

# అధైర్య పడొద్దు... అండగా ఉంటా

- మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప

బెజ్జూర్, డిసెంబర్ 12 : ఎన్నికల్లో తన గెలుపుకోసం శ్రమించిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ధైర్యం కోల్పోకుండా ఉండాలని తమకోసం కష్టపడిన అందరినీ ఆదుకుంటానని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తమ హయాంలో ప్రజలు గర్వ పడేలా పనులు చేశామన్నారు. అదే విధంగా సీఎంగా కేసీఆర్ ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లామన్నారు. అయినా ప్రజలు కొంతమంది మాయ మాటలు విని మోసపోయారని పేర్కొన్నారు. మండలంలో తమకు ఎక్కు మెజారిటీ ఇచ్చిన కార్యకర్తలందరనీ అభినందించారు. ఇదే స్ఫూర్తితో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకుల వెనువెంటనే ఉంటూ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఏ సమస్యలున్నా పరిష్కరించేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. తొందర పాటు లేకుండా లేకుండా ఓపికతో ఉంటూ సంయమనం పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పంద్రం పుష్పలత, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సిడాం సకారాం, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు కొండ్ర జగ్గాగౌడ్, సింగిల్‌విండో చైర్మన్ కుర్సింగ ఓంప్రకాశ్, మాజీ చైర్మన్ డోకె వెంకన్న, కో-ఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్, నాయకులు నాహెర్, సతీశ్, జావీద్, మహేశ్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

### పలు కుటుంబాకుపరామర్శ

కౌటాల, డిసెంబర్ 12: మండలంలోని విర్దండి గ్రామ సర్పంచ్ మడావి రేణుక అత్త మడావి జనాబాయి(80), అదే విధంగా గుడ్లబోరి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యూత్ నాయకుడు వాయుకుమార్ నానమ్మ నీలాబాయి(82) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప వారి ఇండ్లకు వెళ్లి మృత దేహాలకు నివాళులర్పించారు. వారి కుటుంబాలకు కొండంత అండను నింపారు. ఎంపీపీలు బసార్కర్ విశ్వనాథ్, డుబ్బుల నానయ్య, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొమురం మాంతయ్య, గుడ్లబోరి ఎంపీటీసీ వసంత్ రావు, తదితరులున్నారు.

### మీతోనే ఉంటా.. అధైర్య పడొద్దు..

ఎన్నికల్లో ఓడినా, మీ అందరితోనే ఉంటానని, అధైర్య పడొద్దని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో కౌటాల, చింతలమానెపల్లి మండలాల కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలకు ధైర్యాన్ని నింపారు. మనం ఓటమి పాలైనందుకు ప్రజలకు దూరంగా ఉండకూడదని, ఎలాంటి అవసరమున్నా మనమంతా ఇంతకు ముందులాగే దగ్గరుండి సేవ చేయాలన్నారు. వెంట చింతలమానేపల్లి ఎంపీపీ డుబ్బుల నానయ్య, కౌటాల సర్పంచ్ వొజ్జల మౌనిష్, మొగడ్ధగడ్ ఎంపీటీసీ బొమ్మకంటి మనీశ్, ఉపసర్పంచ్ తిరుపతి, చింతలమానేపల్లి కో ఆప్షన్ సభ్యుడు నాజీం హుస్సేన్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ టోంబ్రె మారుతి, ఇరు మండలాల బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులున్నారు..

## జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


సన్మానిస్తున్న నెట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అలీ బిన్ అహ్మద్, ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 12: జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. మేడ్చల్‌లో తెలంగాణ నెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన మేకర్తి వంశీవర్ధన్, జంజిరాల అజయ్ ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు హర్యానా లో జరగనున్న 15 నెట్ బాల్ ఫెడరేషన్ కప్ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థులను నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అలిబీన్ అహ్మద్, పీడీ బీ తిరుపతి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులను సన్మానించారు. అలీబిన్ అహ్మద్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, జిల్లాలో నెట్ బాల్ క్రీడా అభివృద్ధికి కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఉపాధ్యాయులు, యాజమాన్య కమిటీ చైర్మన్ ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

## బ్లాక్‌బోర్డు అందజేత

ఆసిఫాబాద్, డిసెంబర్12: జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కళాశాల ఉర్దూ మీడియం విద్యార్థుల కోసం ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అధ్వర్యంలో బ్లాక్‌బోర్డులను ప్రదానం చేశారు. సంఘం అధ్యక్షుడు తారిక్, నోడల్ అధికారి శంకర్, ప్రిన్సిపాల్ రాందాస్, నాయకులు ఇనిసార్, సల్మాన్‌ఖాన్, ఖలీల్, ఇమ్రాన్, మతిన్, ఆరిఫ్, అధ్యాపకులు శ్రీనివాస్, ఇబ్రహీం, మహెబూబ్, రుక్సానా తదితరులు పాల్గొన్నారు.

# మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలి

- రైతులకు కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు పిలుపు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 12: వరి పంట మద్దతు ధరను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. జిల్లాలోని కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ వేణు, జిల్లా పౌరసరఫరాల అధికారి తారామణి, ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్‌తో కలిసి మంగళవారం గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, నిబంధనల మేరకు నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు. గోనె సంచులను రైతు కల్లాలకు, అనుమతి లేని ప్రదేశాలకు ఇవ్వకూడదని, తేమ శాతం 17 కంటే తక్కువ ఉన్నా, ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన సమయంలో తప్పనిసరిగా రశీదును సంబంధిత రైతులకు అందజేయాలని, వ్యవసాయ శాఖ, వ్యవసాయ విస్తరణ శాఖ ధృవపత్రం లేకుండా ధాన్యం కొనుగోలు చేయకూడదని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రేడ్ ఏ రకానికి రూ.2203, సాధారణ రకానికి రూ. 2183 చెల్లించడం జరుగుతుందని, రైతులు మద్దతు ధర పొందాలంటే కేంద్ర ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ధాన్యాన్ని ఆరబెట్టి, చెత్త-తాలు, మట్టిపెడ్డలు, రాళ్లు లేకుండా శుభ్రపరిచి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. తేమ గరిష్టంగా 17 శాతం, చెత్త-తాలు 1 శాతం, మట్టి పెడ్డలు-రాళ్లు 1 శాతం, చెడిపోయిన, రంగు మారిన, మొలకెత్తిన, పురుగుతిన్న ధాన్యం 5 శాతం, పూర్తిగా తయారు కాని, ముడుచుపోయిన ధాన్యం 3 శాతం, తక్కువ రకాల మి శ్రమం 6 శాతం, చెడిపోయిన, మొలకెత్తిన, పురుగుతిన్న ధాన్యం 4 శాతానికి మించి ఉండరాదని తెలిపారు. రైతులు తమ ఫోన్ నంబర్ ను ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతాతో అనుసంధానం చేసుకొని ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, మొబైల్ నంబర్ అనుసంధానం కోసం బ్యాంకులు, ఆధార్ కేంద్రాలు, పోస్టాఫీసులు, మీ సేవ కేంద్రాల్లో సంప్రదించాల ని తెలిపారు. రైతులు పూర్తి ధ్రువీకరణ పత్రాలతో కొనుగోలు కేంద్రాలకు రావాలని తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్ 1967, 1800425 0033లలో సంప్రదించవచ్చని చెప్పారు. కొనుగోలు కేంద్రాల వద్ద పూర్తి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మిల్లర్ దగ్గర నుండి రశీదు తీసుకొని 48 గంటలలోగా రైతులకు నగదు జమ చేసే విధంగా ఆన్‌లైన్ లో నమోదు చేయాలని, కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్లు, వెయింగ్ మిషన్లు, మాయిశ్చర్ మీటర్లు, ధాన్యాన్ని శుభ్రపరిచే క్లీనర్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.


పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ హేమంత్ సహదేవ్ రావు